www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

గురువారం
05.11.2026



3 లో..

- సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాం
- గొల్లంకొండ నుంచే హైదరాబాద్ నగర నిర్మాణం
- యాదవులకు దక్కాల్సిన న్యాయమైన వాటా ఇస్తాం
- రాజధాని ప్రగతిలో యాదవులు భాగస్వాములు కావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక
సదర్ ఉత్సవాలు

సదర్ పండుగ కేవలం యాదవులకే కాకుండా యావత్ తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక గుర్తింపునకు ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తాము అధికారంలోకి రాగానే సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించి, నిర్వహణ కోసం రూ.5 కోట్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. చారిత్రక గోల్కొండ నిర్మాణం మొదలుకొని హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర, శ్రమ ఎనలేనిదని ప్రశంసించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన ఆధారంగా భవిష్యత్తులో యాదవులకు న్యాయమైన వాటా దక్కేలా చూస్తామని హామీ ఇస్తూ, రాజధాని నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణాల్లో యాదవ సోదరులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కలంజ్యోతి, హైదరాబాద్



- రైతుభరోసా పేరుతో ఫేక్ మెసేజ్‌లు
- మెసేజ్‌లు చూసి సంబురపడ్డ అన్నదాతలు
- బ్యాంకుల్లో డబ్బులు పడలేదన్న అధికారులు
- ఆ మెసేజ్‌లు ఫేక్ అంటూ వ్యవసాయశాఖ ప్రకటన
- విచారణకు సైబర్‌క్రైమ్‌ను ఆశ్రయించిన ప్రభుత్వం

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అన్నదాతల ఫోన్లకు రైతుభరోసా నిధులు జమైనట్లు నకిలీ సందేశాలు రావడం తీవ్ర కలకలం రేపింది. ఎకరాకు రూ.12 వేల చొప్పున ఖాతాల్లో పడ్డాయంటూ ముఖ్యమంత్రి పేరిట వచ్చిన ఎస్ఎంఎస్‌లను నమ్మి బ్యాంకుల వద్దకు వెళ్లిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఈ మెసేజ్‌లతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పిన వ్యవసాయ శాఖ, నిధుల జమ వ్యవహారం పూర్తిగా నకిలీ అని స్పష్టం చేసింది. రైతులను అయోమయానికి గురిచేసిన ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది.

కలంజ్యోతి బ్యూరో



2 లో..

రైతుభరోసా నిధులు జమ



4 లో

రాజధానికి నీటి ఎద్దడి



4 లో

మియాపూర్‌లోని 550 ఎకరాల సర్కారు భూములను వేలానికి పెట్టాలనే ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. అత్యంత విలువైన ఈ భూములను అమ్మేయడం కాకుండా నిరుపేదల ఇళ్లకు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల భూదందాకు తెరలేపిందని, అక్రమంగా భూములు కొనుగోలు చేసే పారిశ్రామికవేత్తలు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. పాలన చేతగాక ప్రభుత్వ ఆస్తులను తెగనమ్ముతున్న రేవంత్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఏడాది తిరిగేసరికి మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. – కలంజ్యోతి, హైదరాబాద్



పేదలు, అమరులకు 550 ఎకరాలు పంచాలి

- ప్రభుత్వ స్థలాల అమ్మకం కుట్రలను తిప్పికొడతాం
- హిల్ట్ పాలసీ స్కాంలో భాగస్వాములు కావొద్దు
- అక్రమంగా కొంటే భారీ మూల్యం తప్పదు
- ఏడాది తిరిగేసరికి మళ్లీ కేసీఆర్ సర్కార్ వస్తుంది : కేటీఆర్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
గురువారం 05.11.2026
www.kalamjyothi.com

రైతుభరోసా నిధులు జమ



కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 04) : అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అయినట్లు మొబైల్ ఫోన్లకు పెద్ద సంఖ్యలో మెసేజ్‌లు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2,73,128 మంది రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.12 వేల చొప్పున సీఎం రేవంత్‌రెడ్డి పేరిట ఈ సందేశాలు రావడంతో పల్లెల్లో ఒక్కసారిగా సందడి మొదలైంది. నిధులు విడుదలయ్యాయని భావించిన రైతన్నలు తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. ఖాతాల్లో పడ్డ డబ్బులను తీసుకునేందుకు రైతులు ఉదయాన్నే స్థానిక బ్యాంకులకు పరుగులు తీశారు. తీరా ఖాతాల వివరాలు పరిశీలించిన బ్యాంకు అధికారులు ఎలాంటి నిధులు జమ కాలేదని తేల్చిచెప్పారు. దీంతో ఒక్కసారిగా రైతులు తీవ్ర నిరాశకు గురవడంతో పాటు గ్రామాల్లో అయోమయం, గందరగోళం నెలకొంది.

మెసేజ్‌లతో ప్రభుత్వానికి సంబంధం లేదన్న వ్యవసాయశాఖ..

రైతుల ఫోన్లకు వచ్చినవన్నీ నకిలీ మెసేజ్‌లని అధికారులు స్పష్టం చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఇలాంటి ఫేక్ మెసేజ్‌లను రైతులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని తేల్చిచెప్పారు. ప్రస్తుతం పీఎం కిసాన్ నిధుల జమ ప్రక్రియ మాత్రమే నడుస్తోందని, రైతుభరోసా నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వం నేరుగానే అధికారిక ప్రకటన చేస్తుందని వెల్లడించారు. రైతులకు చేరిన సందేశాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ప్రభుత్వ శాఖ ద్వారా వీటిని పంపలేదని వ్యవసాయ శాఖ అధికారికంగా ప్రకటించింది. శాఖాపరంగా అధికారిక సమాచారం కోసం వాడే సీడాక్ ఎస్ఎంఎస్ పోర్టల్‌ను ఎవరైనా దుర్వినియోగం చేశారా లేదా సైబర్ నేరగాళ్లు చొరబడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సైబర్ క్రైమ్ విచారణకు ప్రభుత్వ ఆదేశాలు..

రైతులను గందరగోళానికి గురిచేసేలా వ్యవహరించిన ఈ ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మెసేజ్‌లు పంపిన సంస్థలు, వ్యక్తులను గుర్తించి, ఐపీ అడ్రస్‌లను ట్రేస్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి సైబర్ క్రైమ్ పోలీసులకు లేఖ రాశారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులను ఎట్టిపరిస్థితుల్లోనూ నొక్కవద్దని, బ్యాంకింగ్ ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని రైతులకు సూచించారు.

నిందితుల గుర్తింపునకు ఎఫ్ఆర్ఎస్

- నేరాల నియంత్రణకు సాంకేతికత వాడాలి
- సత్వర పరిష్కారానికి ఎఫ్ఆర్ఎస్ ఉపయోగం
- నిందితులను త్వరగా గుర్తించి చర్యలు తీసుకోవాలి
- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల



కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 04) : నేరాలకు పాల్పడి తప్పించుకుని జన సమూహాల్లో తిరుగుతున్న అనుమానితులను సైతం గుర్తించేందుకు ఎఫ్ఆర్ఎస్ విధానం ఉపయోగపడుతుందని ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. నిందితుల గుర్తింపునకు కొత్త సాంకేతిక విధానం, కొత్త మాడ్యూల్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కేసుల సత్వర పరిష్కారానికి ఈ విధానం ఉపకరిస్తుందన్నారు. జన సమూహాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల ను, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ముఖాల ఆధారంగా గుర్తించే విధానంపై వివరించారు. ఈ సాంకేతికత ద్వారా అనుమానిత వ్యక్తులను త్వరగా గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

నేర పరిశోధనలో సాంకేతికతను వినియోగించాలి..

అలాగే వేలిముద్రల ఆధారంగా వ్యక్తులను గుర్తించే విధానం గురించి వివరించారు. నేర పరిశోధనలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఫింగర్ ప్రింట్ యూనిట్ నిర్మల్ సిబ్బంది, డీసీఆర్బీ సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు మరింత సమర్థవంతంగా కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

జబల్పూర్ ఐఐటీలో విద్యార్థిని అనుమానాస్పద మృతి



యువతి మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన



కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 04) : చెన్నారావుపేట మండల కేంద్రంలో బుధవారం యువతి మృతదేహంతో బంధువులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. నర్సంపేట మండలం బుచ్చినాయక్‌తండాకు చెందిన వైష్ణవి మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్ ఐఐటీలో మూడో సంవత్సరం చదువుతోంది. హాస్టల్ గదిలో ఆమె మృతిచెందినట్లు సమాచారం. తమ కుమార్తె మృతికి చెన్నారావుపేట మండలం పాపయ్యపేట శివారు అమృతండాకు చెందిన బోడ సుమన్ అనే యువకుడే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని యువకుడి ఇంటికి తీసుకెళ్లేందుకు బంధువులు ప్రయత్నించగా, ఎస్ఐ గోవర్ధన్ సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద బంధువులు, స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. యువతి మృతికి గల కారణాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.



తండ్రికి ఐదేళ్ల కూతురు తలకొరివి

- చిన్నారుల రోదనతో కన్నీటిసంద్రమైన మగ్దూంపురం
- అనారోగ్యంతో కోలా ప్రభాకర్ మృతి
- నాన్నా లే నాన్నా అంటూ పసిపిల్లల ఆర్తనాదాలు
- గుండెలవిసేలా రోదించిన గ్రామస్తులు, కుటుంబసభ్యులు

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 05) : చెన్నారావుపేట మండలం మగ్దూంపురం గ్రామానికి చెందిన కోలా ప్రభాకర్ (34) అనారోగ్య సమస్యలతో అకాల మృతి చెందారు. ఆయన ఆర్డీఓ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ విధి నిర్వహణలో అందరితో ఎంతో ఆప్యాయంగా మెలిగేవారు. ఆయనకు భార్య అనిత, ఇద్దరు కూతుళ్లు ఆద్యశ్రీ (5), ఆరాధ్య (3) ఉన్నారు. చిన్న వయసులోనే కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడింది. చేతికి అందివచ్చిన కొడుకు, భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న భార్య, పసిబిడ్డల రోదనలతో ఆ ప్రాంతమంతా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఉద్యోగ బాధ్యతల్లో నిబద్ధతతో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచిన ఆయన అకాల మరణం మగ్దూంపురం గ్రామస్తులను, తోటి ఉద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

హృదయాలను కలచివేసిన ఆద్యశ్రీ తలకొరివి దృశ్యం..

తండ్రి ఇక లేడన్న విషయం కూడా అర్థం కాని ఆ పసిపిల్లలు నిర్జీవంగా పడి ఉన్న తండ్రిని చూస్తూ 'నాన్నా.. లే నాన్నా..' అంటూ అమాయకంగా పిలుస్తుండటం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కన్నీటి పర్యంతం చేసింది. ప్రభాకర్‌కు కుమారులు లేకపోవడంతో ఆచారాల ప్రకారం పెద్ద కూతురు ఐదేళ్ల ఆద్యశ్రీ తండ్రి చితికి తలకొరివి పెట్టింది. తండ్రి ఒడిలో ఆడుతూ, పాడుతూ గడపాల్సిన పసిప్రాయంలోనే ఆయనకు అంతిమ వీడ్కోలు పలకాల్సి రావడం అక్కడి వారి గుండెలను పిండేసింది. నిన్నటి వరకు ఆ చిన్నారుల సమస్త ప్రపంచం నాన్నే కాగా, నేడు ఆ నాన్నే లేని లోకంలో ఆ పసి హృదయాలు ఒంటరయ్యాయి. ఈ అత్యంత హృదయవిదారక దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఆ కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

గురువారం 05.11.2026

www.kalamjyothi.com



తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక

సదర్ ఉత్సవాలు

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 04) : సదర్ పండుగ కేవలం యాదవులకు మాత్రమే పరిమితం కాదని, యావత్ తెలంగాణ ఆత్మగౌరవానికి, రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపునకు ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాలనే ఆలోచనే చేయలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యాదవుల ఆకాంక్షల మేరకు రాష్ట్ర పండుగగా ప్రకటించామని గుర్తు చేశారు. ఉత్సవాల నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు చేశామని, సదర్ నగర సంస్కృతికి అద్దం పట్టే విశిష్ట వేడుక అని కొనియాడారు.





గొల్లకొండ నుంచే రాజధాని ప్రస్థానం..

చారిత్రాత్మక హైదరాబాద్ నగర ప్రస్థానంలో గోల్కొండ కోట ఒకనాటి గొల్లకొండ అని, యాదవుల సహకారంతోనే ఈ నగరం ఇంతగా ప్రగతి సాధించిందని ముఖ్యమంత్రి వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. ఆర్బీఐ వద్ద డబ్బులు నిలిచిపోయినా కావొచ్చేమో కానీ, కష్టపడే తత్వమున్న యాదవుల వద్ద సంపదకు, దానగుణానికి ఎన్నటికీ కొరత ఉండదని సరదాగా వ్యాఖ్యానించారు. సమాజ నిర్మాణంలో వారి కష్టం, స్వేదం వెలకట్టలేనివని పేర్కొన్నారు.

పాలనలో సముచిత రాజకీయ ప్రాధాన్యం..

దేశానికే దిక్సూచిగా తెలంగాణలో సమగ్ర కులగణన చేసి చూపించామని, భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన న్యాయమైన వాటాను కచ్చితంగా అందిస్తామని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే యాదవులకు సముచిత రాజకీయ ప్రాధాన్యం కల్పించామని, అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు, నవీన్ యాదవ్‌ను ఎమ్మెల్యేగా, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట పాలకమండలి సభ్యురాలిగా నియమించామని గుర్తు చేశారు. యాదగిరిగుట్ట గోశాలలో గోసంరక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, యాదవుల ఆత్మగౌరవాన్ని కాపాడుతామని తెలిపారు.

మెగా ప్రాజెక్టుల నిర్మాణానికి సహకరించాలి..

తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపే ప్రయాణంలో యాదవులు సంపూర్ణ సహకారం అందించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. చారిత్రక మూసీ నది పునరుజ్జీవం, మెట్రో రైలు విస్తరణ, ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని వర్గాల తోడ్పాటు అవసరమని స్పష్టం చేశారు. రాజధాని నగరం అంతర్జాతీయ స్థాయిలో మరింత వన్నెతగ్గకుండా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ కుమార్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.



స్వేరో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 04) : చెన్నారావుపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈ నెల 22న నిర్వహించనున్న స్వేరో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. మండల స్వేరో కన్వీనర్ నమిండ్ల సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న, మండల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ జక్క అశోక్ యాదవ్ హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వేరోల ఐక్యత, ఆత్మగౌరవం, విద్య, సామాజిక చైతన్యాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఆత్మీయ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ నెల 22న జరిగే సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వేరో నర్సంపేట కన్వీనర్ కల్లేపల్లి సురేష్, చెన్నారావుపేట ఇన్‌చార్జ్ ఈదునూరి యాకన్న, కోకన్వీనర్ చిలువేరు చిరంజీవి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మురారి రవి, మాజీ ఎంపీటీసీ మాదాసి కుమార్, మాజీ సర్పంచ్ కుండే మల్లయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కందగట్ల సాంబయ్య, దుగ్గొండి స్వేరో నాయకులు గోవిందు మురారి, నర్మెట్ట సాంబన్న, నమిండ్ల అనిల్, జన్ను నరేష్ రాజు తదితరులతో పాటు వివిధ మండలాల స్వేరో, డివిజన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దూడలకు నట్టల నివారణ మందులు

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 04) : చెన్నారావుపేట మండలం తిమ్మరాయనిపహాడ్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడలకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం 35 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ జునేద్ ఖాన్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ శ్రవణ్, గ్రామ సర్పంచ్ దారావత్ రమేష్, ప్రముఖ పాడి రైతు కె. ప్రదీప్ కుమార్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

ప్రవళిక మృతికి సంతాపం

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 04): మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ ప్రవళిక మృతికి సంతాపంగా నిర్మల్ బస్ డిపో నుంచి బస్ స్టేషన్ వరకు ఆర్టీసీ సిబ్బంది బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రయాణికురాలు దాడి చేసి తోసేసిన ఘటనలో బస్సు కింద పడి కాళ్ళు కోల్పోయి మృతి చెందింది. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.





ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం

మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ

కలంజ్యోతి, ఇల్లంతకుంట (నవంబర్ 04) : యాసంగి పంటల సాగులో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ సూచించారు. పెద్దలింగంపూర్ రైతు వేదికలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగుకు అధికంగా నీరు అవసరమవుతున్న నేపథ్యంలో, నీటి లభ్యతను బట్టి తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకొని పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

భూసార పరిరక్షణకు సేంద్రియ ఎరువుల వాడకం..

కేత్ బచావో అభియాన్‌లో భాగంగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను ఉపయోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. భూసారం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల రెవెన్యూ అధికారి సురేష్, ఎంపీడీవో శశికళ, ఇరిగేషన్ ఏఈ దిలీప్, ఏఈవో మౌనిక, పశువైద్యాధికారి పూర్ణచంద్రిక, ఏపీఎం, గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత, రామోజీపేట సర్పంచ్ చొప్పరి భూమయ్య, ఉపసర్పంచ్ రమేష్, ఇతర ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
4
గురువారం 05.11.2026
www.kalamjyothi.com



పేదలు, అమరులకు 550 ఎకరాలు పంచాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 04) : మియాపూర్‌లోని 550 ఎకరాల సర్కారు భూములను అమ్మేయాలనే ఆలోచనను వెంటనే విరమించుకొని, నిరుపేదలకు, ఉద్యమకారులకు పంచాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే రేవంత్ రెడ్డి కమీషన్ల కోసం భూములు అమ్మడం సిగ్గుచేటన్నారు. ఇందులో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరుల కుటుంబాలకు, 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించాలని, మిగతా స్థలంలో పాఠశాలలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

హిల్ట్ పేరుతో పారిశ్రామిక స్థలాల తెగనమ్మకం..

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హిల్ట్) రూపంలో సర్కారు భారీ అవినీతికి శ్రీకారం చుట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. శేరిలింగంపల్లిలోని ఆలిండ్ సంస్థకు చెందిన రూ.10 వేల కోట్ల విలువైన 100 ఎకరాల భూమిని నామమాత్రపు ధరకే ధారాదత్తం చేసేలా తెరవెనుక మంతనాలు సాగుతున్నాయని ఆరోపించారు. రాజధాని చుట్టూ ఉన్న 10 వేల ఎకరాల ఆస్తులను అడ్డగోలుగా తెగనమ్ముతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం విసిరే ఎంగిలి మెతుకులకు పారిశ్రామికవేత్తలు ఆశపడి ఈ భూములు కొంటే భవిష్యత్తులో తీవ్ర మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఢిల్లీ నేతల వద్ద కాంగ్రెస్, బీజేపీ బానిసత్వం..

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ పాలకుల ముందు ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలు సంచులు మోసే ముఠాలా మారితే, బీజేపీ నేతలు చెప్పులు మోసే స్థాయికి దిగజారారని విమర్శించారు. బండి సంజయ్ హోదా మరిచి అమిత్ షా ర్యాలీలో బౌన్సర్‌లా వ్యవహరించడం కరీంనగర్ ప్రజలను అవమానించడమేనన్నారు. బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తనకంటే చిన్నవాడైన అమిత్ షా కాళ్లు మొక్కడం సిగ్గుచేటని, కేంద్రం నుంచి ప్రాజెక్టులు తీసుకురావడం చేతగాని నేతలు ప్రచారాలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు.

ఎన్నికల హామీలు గాలికి

- కేసీఆర్ పాలనే శరణ్యం..

ల్యాండ్ బ్రోకర్ మనస్తత్వంతో వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి సర్కారు భూములు అమ్ముకోవడం తప్ప ప్రజాపాలన చేతకావడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి ప్రజలను నిలువునా మోసం చేశారని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నటన సినీ తారలను మించిపోయిందని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర విరక్తి మొదలైందని, ఏడాది తిరిగేసరికి మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం రాగానే కాంగ్రెస్ హయాంలో జరిగిన భూవిక్రయాలు, హిల్ట్ పాలసీ అక్రమాలపై సమగ్ర విచారణ జరుపుతామని స్పష్టం చేశారు.



గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న 'వేక'కు కృతజ్ఞతలు

సాదుల నగర్‌లో మురుగుకాలువ నిర్మాణానికి శ్రీకారం

కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 05) : హత్నూర మండల పరిధిలోని సాదుల నగర్ గ్రామంలో బుధవారం నాడు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సాదుల నగర్ సర్పంచ్ లక్ష్మి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సాదుల నగర్ సర్పంచ్ లక్ష్మి కృష్ణ, ఉపసర్పంచ్ పల్లవి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సీఎస్ఆర్ ఫండ్స్ నుండి ఆర్థిక సహకారం అందిస్తున్న వేక పరిశ్రమ యాజమాన్యానికి, పరిశ్రమ ప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాదుల నగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి విక్రాంత్ రెడ్డి, గ్రామపంచాయతీ సభ్యులు బాసాడపు శ్రీవాణి శ్రీకాంత్ గౌడ్, మంగలి నాగరాజు, మంగాపురం అమృత వెంకటేశం, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌కు ఘన స్వాగతం

బాధ్యతల స్వీకరణ - పాలకవర్గం శుభాకాంక్షలు

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 04) : నర్సంపేట మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.నరేష్ రెడ్డికి మున్సిపల్ పాలకవర్గం తరఫున ఘన స్వాగతం లభించింది. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిషనర్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణ సమగ్రాభివృద్ధి మరింత వేగవంతం కావాలని చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించడంతో పాటు ప్రధానంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, మౌలిక



సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నర్సంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.



రాజధానికి నీటి ఎద్దడి

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 04) : రాజధాని నగరంలో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చడంతో కాలనీలు, బస్తీల్లో నీటి యుద్ధాలు మొదలయ్యాయి. గత రెండు రోజుల నుంచి నగరంలోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వేల రూపాయలు వెచ్చించి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నా ట్యాంకర్లు రాకపోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. దీంతో హాస్టళ్లలో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు, ఉద్యోగులు కనీస కాలకృత్యాలు తీర్చుకోవడానికి, గుక్కెడు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాటర్ వర్క్స్ ఎదుట బైఠాయింపు..

ట్యాంకర్ల సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులు పెద్ద ఎత్తున రోడ్డెక్కారు. ఎస్సార్ నగర్ పరిధిలోని వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించి తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగారు. ముందస్తు సమాచారం ఏమీ ఇవ్వకుండా ఉన్నపళంగా కమర్షియల్ కేటగిరీ కింద వచ్చే ట్యాంకర్ల సరఫరాను నిలిపివేయడం దారుణమని మండిపడ్డారు. కార్యాలయం ముట్టడికి యత్నించడంతో అధికారులు, పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

హాస్టళ్లకు ప్రత్యేక కోటా

కింద ట్యాంకర్లు ఇవ్వాలి..

నీళ్లు లేకపోవడంతో హాస్టళ్లలోని విద్యార్థులు పడుతున్న నరకయాతనను చూసి తట్టుకోలేకపోతున్నామని నిర్వాహకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వంటలు చేసుకోవడానికి, తాగేందుకు నీరు దొరక్క హాస్టళ్లను మూసివేయాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. పరీక్షల సమయంలో ఇలాంటి సమస్యలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయని ఆందోళన చెందారు. వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి హాస్టళ్లకు ప్రత్యేక కోటా కింద నీటి ట్యాంకర్లను నడపాలని, సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉమాదేవి పార్థివదేహానికి ఘన నివాళి

బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి



కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 04) : చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన ఈగ సాగర్ భార్య ఈగ ఉమాదేవి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జున్నుతుల రాందెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మాజీ సర్పంచ్ కుండే మల్లయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, మండల ఉపాధ్యక్షుడు కుసుమ కుమార్, కోఆప్షన్ సభ్యుడు గఫర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కందగట్ల సాంబయ్య, జున్నుతుల శ్రీధర్ రెడ్డి, వార్డు సభ్యులు రసముల సతీష్, గుడిశాల సురేందర్, మూడు రమేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి బోడ మురళి నాయక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
5
గురువారం 05.11.2026
www.kalamjyothi.com



ఆర్టీసీ కార్మికుల భద్రత మా బాధ్యత

మంత్రి పొన్నం ప్రభాకర్

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 04) : ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు బ్యాంకు ద్వారా రూ.కోటి ప్రమాద బీమా అందేలా చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి ప్రవళిక పార్థివదేహానికి నివాళులర్పించారు. కదులుతున్న బస్సు నుంచి నెట్టివేసిన మహిళపై హత్యకేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయాలి..

సిబ్బంది ప్రవర్తనలో లోపాలుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప ప్రయాణికులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని మంత్రి సూచించారు. చిల్లర వివాదంలో ప్రయాణికురాలు తోసివేయడం వల్లే నిండు ప్రాణం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల సౌకర్యాలతో పాటు విధుల్లో ఉండే ఆర్టీసీ సిబ్బంది సంక్షేమం, రక్షణ కూడా ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం, ఆర్టీసీ అందించే పరిహారంతో పాటు ప్రమాద బీమా ద్వారా కుటుంబానికి పూర్తి ఆర్థిక భరోసా కల్పిస్తామన్నారు. ప్రవళిక మృతితో ఆ కుటుంబానికి జరిగిన తీరని లోటును పూడ్చలేమని, అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు.

సిబ్బందిపై దాడులు చేస్తే ఉపేక్షించబోం..

ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. విధుల్లో ఉండే సిబ్బందిపై దాడులకు పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూనే కార్మికుల రక్షణకు కట్టుబడి ఉన్నామని, మణుగూరు డిపో మినహా మిగతా చోట్ల బస్సులు యథావిధిగా నడిచాయని వివరించారు.





పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

- పేదవారి ముంగిటకే ఉచిత వైద్యం తెస్తాం
- డబ్బులేక ఎవరూ వైద్యానికి దూరం కావద్దు
- ప్రతి మండలంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తాం
- డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి



కలంజ్యోతి, ఖానాపురం (నవంబర్ 04) : నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం మండల కేంద్రంలో రెడ్డి పెద్ద రంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో జనతా ట్రస్ట్, బంధన్ హాస్పిటల్స్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, ఐదవ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బున్న వారికి ఎక్కడైనా వైద్యం అందుతుందని, కానీ పేదవారి ఇంటి ముంగిటకే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా తీసుకురావడమే జనతా ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. డబ్బులేక ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రతి మండలంలో ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

976 మందికి కంటి పరీక్షలు
- 66 మందికి ఉచిత ఆపరేషన్లు..

శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో 976 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, 476 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి శస్త్రచికిత్స అవసరమైన 66 మందిని ఎంపిక చేశారు. వీరికి హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు మందులు కూడా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వివిధ విభాగాల్లో 268 మందికి వైద్య సేవలు..

అదేవిధంగా బంధన్ హాస్పిటల్స్‌కు చెందిన సుమారు 12 మంది వైద్య నిపుణులు వివిధ విభాగాల్లో 268 మందికి పైగా వైద్య సేవలు అందించారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, పల్మనాలజీ, గైనకాలజీ, డెంటల్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, క్రిటికల్ కేర్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బంధన్ హాస్పిటల్‌లో తదుపరి చికిత్సలు, శస్త్రచికిత్సలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని వైద్య బృందం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో జనతా ట్రస్ట్ సభ్యులు, బంధన్ హాస్పిటల్స్, శంకర కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కాంగ్రెస్ అక్కల్‌చెడ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 04) : చెన్నారావుపేట మండలం అక్కల్ చెడు గ్రామానికి చెందిన ఈగ ఉమాదేవి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆమె స్వగృహానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి భర్త ఈగ సాగర్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, నాయకులు బోనగిరి సారయ్య, గంట వీరన్న, బాధావత్ వీరు, బొంత సురేష్, లక్క ఇంద్రయ్య, తేజావత్ శివ, కరెడ్ల శివ, ఒంటరి అశోక్, సిద్ద జనార్దన్, బాధావత్ కిషోర్, కొత్త శ్రీకాంత్, చిలుక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు నటిగా గర్విస్తున్నా..



టాలీవుడ్ తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని, తెలుగు నటిగా తెను ఎంతో గర్విస్తున్నానని పాయల్ రెజ్‌పుత్ పేర్కొన్నారు. ఆర్ఎక్స్-100, మంగళవారం చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించారు. పరిశ్రమ నుంచి పేరు ప్రఖ్యాతలు, గుర్తింపు పొందిన తర్వాత ఇప్పుడు తెలుగు వ్యవస్థను నిందించడం కేవలం అసంబద్ధమైన ద్వేషం తప్ప మరొకటి కాదన్నారు. తన ఎదుగుదలకు కారణమైన చిత్ర పరిశ్రమకు ఎప్పటికీ అండగా ఉంటానని స్పష్టం చేశారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.1-83/8-5/-1-2-/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30-/1/-426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.